పేదలకు పప్పు కరువు

- కార్డుదారులకు అరకొరగా సరఫరా
- గ్రామాల్లో రేషన్ షాపులకు వంద కిలోల చొప్పున కేటాయింపు
- తెనాలిలో మాత్రం రెండేసి వందల కిలోలతో సరిపెట్టిన ప్రభుత్వం

తెనాలి: రేషను కార్డుదారులకు పౌష్టికాహార పంపిణీ పేరుతో గత నెలలో రాగులను అరకొరగా అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో కందిపప్పు, చక్కెరను అదే తరహాలో పంపిణీ చేసింది. 'కార్డుదారులు బోలెడు...కందిపప్పు ఇచ్చింది సోలడు' అన్నట్టుగా రేషను పంపిణీ తయారైంది. కనీసం సగం మందికి కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఆర్భాటంగా మొదలు పెట్టడం దేనికో అర్థంకావడం లేదు ప్రజలకు. కూటమి ప్రభుత్వం చెప్పినంత ఆర్భాటంగా ప్రజా పంపిణీ తీరు లేదని కార్డుదారులు పెదవి విరుస్తున్నారు.

మార్కెట్‌లో కందిపప్పు ధర పైపైకి


గత సార్వత్రిక ఎన్నికలకు ముందు కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120–150 వరకు అమ్మకాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిం తర్వాత క్రమంగా పెరిగింది. ఒక దశలో రూ.180కి పైగా చేరుకుంది. దీనితో రైతుబజార్లలో తగ్గింపు ధరలకు విక్రయాలను ఆరంభించారు. ఆ తర్వాత రేషను దుకాణాల్నుంచి ఎండీయూ వాహనాలతో కిలో రూ.67లకే అందజేస్తామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అనుకున్నదే తడవుగా అక్టోబరు ఒకటిన తెనాలి నుంచే ఈ పథకాన్ని ప్రారంభించారు.

ఆరంభంలోనే అస్తవ్యస్తం

అట్టహాసంగా ప్రారంభమైన కందిపప్పు పంపిణీ కార్యక్రమం ఆరంభంలోనే నీరుగారింది. సరిపడా నిల్వల్ని ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేర్చకుండా హడావుడిగా మొదలుపెట్టారు. దీంతో పంపిణీ అంతా అస్తవ్యస్తంగా మారింది. గుంటూరు జిల్లాలో 972 రేషను దకాణాలుంటే, 5,99,511 కార్డులున్నాయి. వీరందరికీ కిలో చొప్పున కందిపప్పు అందించాలంటే 5.99,511 కిలోలు కేటాయించాలి. అంటే దాదాపు 600 మెట్రిక్ టన్నుల అవసరముంది. అయితే, ఆచరణలో మాత్రం అరకొరగానే 2–3 టన్నులు మాత్రమే వచ్చింది. ఒక్కో రేషను షాపుకు 500–700 కార్డులుంటే కేవలం 100 కిలోలను మాత్రమే ఇచ్చారు. ఒక్కో ఎండీయూ వాహనం రోజుకు 200 కార్డులకు రేషను సరఫరా చేస్తుంది. అంటే వంద కిలోల కందిపప్పు ఒకరోజులోనే అయిపోయింది. మిగిలిన కార్డుదారులకు కందిపప్పు ఇవ్వలేకపోయారు.

పలువురికి మొండిచెయ్యి

మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలోని తెనాలి టౌన్, రూరల్ మండలం, కొల్లిపర మండలంలో మాత్రం ఒక్కో రేషను దుకాణానికి 200 కిలోల చొప్పున ఇచ్చారు. దుగ్గిరాల, చేబ్రోలు మండలాల పరిధిలోని దుకాణాలకు 150 కిలోల వంతున అందజేశారు. ఇక జిల్లాలోని మిగిలిన రేషను దుకాణాలకు వంద కిలోలతోనే సరిపెట్టారు. ఒకే బజారులోని కార్డుదారుల్లో కొందరికీ మాత్రమే ఇచ్చారు. మిగిలిన వారికి మొండిచెయ్యి చూపారు. దీంతో కార్డుదారులు ఏండీయూ ఆపరేటర్లపై ఆగ్రహం వ్యక్తంచేసిన సందర్భాలున్నాయి. రూరల్ మండలంలోని ఒక మేజరు పంచాయతీలో ఎండీయూ ఆపరేషటర్లపై స్థానికులు గొడవకు కూడా దిగారు. ఇక చక్కెర పంపిణీ కూడా తక్కువగానే ఉంది. తెనాలి నియోజకవర్గంలో సరఫరా బాగానే ఉన్నా, జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో ఇవ్వడం లేదని కార్డుదారులు చెబుతున్నారు. దసరా పండగ రోజుల్లో నవరాత్రులు ఆరంభమైన తరుణంలో ఇస్తున్నదే కిలో కందిపప్పు. అదికూడా కనీసం 20 శాతం మందికి కూడా ఇవ్వకపోవడం, కొన్నిచోట్ల చక్కెర కూడా కనిపించకపోవడం కార్డుదారులను నిరాశకు గురి చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దసరా లోపు కందిపప్పు, చక్కెరను అందరికీ ఇప్పించాలని కార్డుదారులు కోరుతున్నారు.



ప్రభుత్వం సరఫరా చేస్తున్న కంది పప్పు

క్లుప్తంగా

సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం ఆవిష్కరణ



తెనాలి రూరల్: స్థానిక రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలోని శైవ సదనంలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పండిత చిలుమూరు రామలింగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ ఉపన్యాసకులు, ఆగమ శాస్త్ర పండితులు, దేవదాయ శాఖ ఆగమ సలహాదారు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఉయ్యూరు జయప్రద, ఈఎల్‌వీ అప్పారావు, చావలి సద్యోజాతం,మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పండిత గాలి సత్యనారాయణ, పి. వినాయకరావు, దేవయజనం మురళీకృష్ణ, దీవి కృష్ణమాచార్యులు, దేవయోజనం అరుణ, సామ్రాజ్యలక్ష్మి, సీహెచ్. ఉమాదేవి పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం



కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపరలో అక్రమంగా 185 క్వార్టర్ మద్యం సీసాల్ని తీసుకువెళ్తున్న ఇద్దరిని శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర వైన్స్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ మసికలపూడి ప్రదీప్, సేల్స్‌మన్‌గా పని చేస్తున్న శిఖరం విజయ్ చంద్ర అనుమతి లేకుండా మద్యం సీసాలు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్‌ఐ పోతురాజు, కానిస్టేబుల్ నాగబాబు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మున్నంగి(కొల్లిపర): యోగాలో పీజీ, డిగ్రీ, డిప్లొమా చేసిన వారు శిక్షకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని మున్నంగి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.సాయి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మున్నంగి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్–ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పని చేయాలని సూచించారు. నెలలో స్త్రీ యోగా శిక్షకులు 20 గంటలు, పురుష యోగా శిక్షకులు 32 గంటల పాటు తరగతులను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి గంటలకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9391399194 నంబర్‌లో సంప్రదించాలని కోరారు,

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

లక్ష్మీపురం: సెల్‌ఫోన్ చూడొద్దని తండ్రి మందలించడంతో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం గుజ్జనగుండ్ల ప్రాంతంలో చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తండ్రి శనివారం మధ్యాహ్నం నిత్యం సెల్‌ఫోన్‌లు చూడటం సరికాదని మందలించి వెళ్లిపోయాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెల్లి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు వేసుకుని ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసుగా నమోదు చేశారు.

నేడు టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

తెనాలి రూరల్: రాష్ట్ర టీ–20 క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం ఉదయం జరుగుతుందని ఏపీ యూత్ టీ–20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్. భాస్కర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్ ఆవరణలో గల యువ క్రికెట్ అకాడమీలో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, తెల్ల దుస్తుల్లో సెలక్షన్స్‌కు రావాలని ఆయన సూచించారు. ఎంపికైన జట్టు నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న నేషనల్ టీ–20 క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు

తెనాలి రూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తెనాలి టౌన్, తెనాలి మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మొత్తం 25 దుకాణాలకు తెనాలి కార్యాలయంలో శనివారం 14 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు మొత్తం 18 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తెలిపారు.

తెనాలిలో రోడ్ల మరమ్మతులకు చర్యలు

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి అర్బన్: పట్టణంలో రోడ్ల మరమ్మతులు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వాహణకు చర్యలు తీసుకోనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులపై కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చర్చించారు. కమిషనర్ బండి శేషన్న ప్రవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వాటి వివరాలు తెలియజేశారు. తెనాలి పట్టణంలోని రక్షిత మంచినీటి కనెక్షన్ల పంపిణీపై వివరాలు సేకరించారు. కనెక్షన్లు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని కమిషనర్ చెప్పడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై స్పందించిన మంత్రి మనోహర్ మాట్లాడుతూ నవంబర్ నుంచి పట్టణంలోని 40 వార్డులలో ఆడిట్ జరిపి కనెక్షన్ల పంపిణీని వేగవంతం చేయనున్నట్లు ప్రకటించారు. బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. అందుకు అవసరమైన స్థల సేకరణ, ఇతర పనులు చూడాలని సబ్ కలెక్టర్ సంజనా సింహకు సూచించారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

పట్టణంలో పడకేసిన పారిశుద్ధ్యం

పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసిందని, కావాల్సిన మేరకు సిబ్బంది కూడా లేరని, అధికారులు తప్పుడు లెక్కలతో మభ్యపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఆవుల కోటయ్య ఆరోపించారు. పట్టణంలో ఖాళీ కొబ్బరి బొండాల సేకరణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ సూచించారు. ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని, బిల్లులు పెట్టటంలో జాప్యం చేయడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని టీడీపీ నాయకులు కొత్రపాటి శ్రీనివాస్ తెలిపారు. అన్ని అంశాలు నోట్ చేసుకున్నామని, వాటిని పరిష్కరిస్తామని కేంద్ర సహాయ మంత్రి హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణలో సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. పట్టణంలోని కొబ్బరి బొండాల సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



కమిషనర్ శేషన్న నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్. వేదికపై రాష్ట్ర మంత్రి నాదెండ్ల , కలెక్టర్ నాగలక్ష్మి

పథకాలు అర్హులకు అందేలా చూస్తాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. మండల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పాఠశాలల్లో వసతులు తదితర అంశాలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ పెమ్మసానితో పాటు రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల, ఆహార శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సబ్ కలెక్టర్ సంజనా సింహా పాల్గొని పలు అంశాలను చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థి భవిష్యత్

తెనాలి: పట్టణానికి చెందిన స్వరలయ వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూలులో అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థి భవిష్యత్ ఉందని తెలిపారు. మండల విద్యాశాఖాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, యునెస్కో సిఫార్సులతో 1994 అక్టోబర్ 5 నుంచి అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం జరుగుతోందని తెలిపారు. సమావేశంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దాసరి వెంకట రామ్‌ప్రసాద్‌ను సత్కరించారు. చక్రవర్తి స్వాగతోపన్యాసం చేయగా, స్వరలయ సభ్యులు మల్లేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు సుందరరావు, మోహనరావు, కోదండ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వెంకట రామ్‌ప్రసాద్‌కు సత్కారం

డ్రోన్ ద్వారా విజయవంతంగా మందుల పంపిణీ

కొల్లిపర: రానున్న రోజుల్లో అతి తక్కువ ఖర్చుతో ఒకచోట నుంచి మరొక చోటకు 10 కేజీల వరకు డ్రోన్ ద్వారా మందులు పంపిణీ చేయవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ తెలిపారు. శనివారం మెడిసిన్ – డ్రోన్ డెలివరీ పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా శనివారం మున్నంగి పీహెచ్‌సీ నుంచి అన్నవరపులంకలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఉన్న ఏఎన్ఎంకు మందులు డెలివరీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా మందులు పంపిణీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు చెప్పారు. పీహెచ్‌సీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నవరపులంకకు పది నిమిషాల్లో పంపినట్లు తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వం అన్ని చోట్లా పరిశీలిస్తుందని, ఈ పద్ధతి విజయవంతం అయితే త్వరలో అన్ని చోట్ల డ్రోన్‌తో మందులు పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


డ్రోన్ డెలివరీ పైలెట్ ప్రాజెక్ట్ ను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ, ఎంపీడీవో విజయలక్ష్మి

కౌలు రైతులంతా తరలిరావాలి

తెనాలి: వరదలు, భారీ వర్షాలకు నష్టపోయిన కౌలు రైతులకే పరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. కౌలురైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 8న విజయవాడ రాఘవయ్య పార్కు వద్ద గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సదస్సులో పాల్గొనాలని ఆయన కోరారు. రైతుసంఘం ప్రతినిధులు శనివారం తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి, గుడివాడ, కఠెవరం గ్రామాల్లో కౌలు రైతుల్ని కలిశారు. నష్టపరిహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూయజమానులు కొందరు పత్రాలను ఇవ్వలేదనీ, ఇచ్చినవారికి కూడా పరిహారం తరతమ భేదాలతో జమయిందని కొందరు రైతులు రైతు సంఘం నేతల దృష్టికి తీసుకొచ్చారు. నష్టపరిహారం అందని కౌలురైతులు అర్జీలు తీసుకుని 8వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ తరలిరావాలని శివసాంబిరెడ్డి కోరారు. సంబంధిత కరపత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు పిల్లి కోటేశ్వరరావు, జ్యోతుల కోటేశ్వరరావు, కర్రె గగారిన్, బండి సుధాకర్, తురకా ఏసుపాదం, ఎం.సుజాతకుమారి, సుశీల, విజయబాబు పాల్గొన్నారు.


గుడివాడలో రైతులతో ములకా శివసాంబిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో ముఠా కార్మికుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఠా కార్మికుడు మృతి చెందిన ఘటన ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సెక్టార్–1 పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, సీతానగర్‌లోని కేఎల్‌రావు కాలనీలో నివాసం ఉంటున్న తాతా వెంకట లక్ష్మణ్(24) వన్‌టౌన్‌లో ముఠా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై నగరానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. సీతమ్మ వారి పాదాలు సమీపానికి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

8న తెనాలిలో వేద మహాసభ

తెనాలి రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లోకహితాన్ని కాంక్షిస్తూ వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 8న వేద మహాసభను నిర్వహించనున్నారు. స్థానిక నాజరపేటలోని అనుగోలు వారి వీధిలోని విద్యా శంకర భారతి నృసింహసదనం వేద పాఠశాల ప్రాంగణంలో ఉదయం ఎనిమిది గంటలకు పండిత విష్ణుభట్ల లక్ష్మీపతి సోమయాజులు పర్యవేక్షణలో సభ ప్రారంభమవుతుందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. సదన భవనంలో శనివారం వేదసభ కరపత్రాలను సమాఖ్య కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సేవా సమాఖ్య లోకహితం కోసం అనేక ధార్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా అత్యంత పర్వదినాలైనా శరన్నవరాత్రి రోజుల్లో వేద సభ నిర్వహిస్తే ప్రజలకు సంపూర్ణ ఆశీర్వాదం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు భాగవతుల కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి రావినూతల రాజేంద్రప్రసాద్, మేళ్లచెరువు అనిల్ కుమార్, పింగళి వేణుధర్, టి. ఆంజనేయులు, గౌరవ సలహాదారులు తంగిరాల వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నారాయణం వేణుగోపాల్, సీఎంకే తిరుమలరావు, బుర్ర ప్రభాకరశర్మ, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.



అంబియంట్ టెక్నో స్కూల్‌లో దసరా వేడుకలు

తెనాలి అర్బన్: చెంచుపేటలోని అంబియంట్ టెక్నో స్కూల్‌లో దసరా వేడుకలను శనివారం సందడిగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినుల దాండియా, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇర్షాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కౌలు రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్ : అధిక వర్షాలకు పంటలు నీటమునిగి దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. శనివారం కుంచనపల్లిలో కౌలు రైతులను కలుసుకుని, పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని, నష్ట పరిహారం కౌలు రైతులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన వరి పంటకు రూ.10వేలు, వాణిజ్య పంటలకు రూ.14 వేలు రైతులకు సరిపోయే పరిస్థితి లేదన్నారు. నష్టపరిహారం అందని కౌలు రైతులందరూ ఈ నెల 8న విజయవాడ మానికేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగే కౌలు రైతుల సదస్సుకు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.60 వేల నుంచి రూ.1 లక్ష వరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, సంఘం తాడేపల్లి కాజా వెంకటేశ్వరరావు, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, యేసయ్య పాల్గొన్నారు.

జయ జయ జయహే మహిషాసురమర్దిని...!


దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా తెనాలిలో శనివారం వివిధ దేవాలయాల్లో అమ్మవార్ల అలంకారాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి. అమ్మ తేజస్సులో, అభయ ముద్రలో భక్తులు తరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాల్లో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. – తెనాలి


చినరావూరులోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దుర్గాదేవిగా..


శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో త్రిపుర సుందరిగా..


శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కాత్యాయనిగా..


దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో మహా వారాహి దేవిగా..


నందివెలుగులోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా..

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు(గుంటూరు జిల్లా)
E.P.121/2013 in O.S.213/2012
Between :
బేతాళ జాషువ ---- డి.హెచ్.ఆర్
మరియు
బేతం హైమారావు ---- జె.డి.ఆర్
పై నెంబరు ఇ.పి లో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్ అయిన బేతం హైమారావు యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని పైకోర్టు వారిచే ది.22-10-2024న ఉదయం గం.10.30ని.ల లగాయితు వేలం వేయబడునని తెలియచేయడమైనది. రావలసినవారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు: గుంటూరు జిల్లా, తెనాలి సబ్ జిల్లా, తెనాలి మున్సిపల్ బౌను సర్వే దాఖలా 12వ వార్డు, 7వబ్లాకు టి.యస్.నెం 486 య.0.11సెంట్లు మెంబుమలె ఇస్టికె హద్దులు. తూర్పు: పిల్లి సోమసుందరరావు స్థలం-19.9" అడుగులు. దక్షిణం: బేతాళ జాషువా స్థలం-20.2" అడుగులు. పడమర: మునిసిపల్ రోడ్డు-19.6"అడుగులు. తిరిగి పడమర: బేతాళ జాషువా మరియు బేతాళ రత్నరాజుల స్థలం-6.0" అడుగులు. ఉత్తరం: మున్సిపల్ బావి భూమి కొంత వరకు మరియు పిల్లి సామియేలు స్థలం 26.10" అడుగులు. తిరిగి దక్షిణం: బేతాళ జాషువ మరియు బేతాళ రత్నరాజుల స్థలం 15.0" అడుగులు ఈ హద్దుల మధ్య 67.8చ॥గ స్థలం అందుగల పాత ఆర్.సి.సి బిల్డింగ్, డోర్ నెం.4-54-75 వేటి పంపు కరెంటు మీటరు, లెట్రిన్, బాత్‌రూమ్.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
డి.హెచ్.ఆర్. విలువ : రూ.5,00,000/-,
అమీనా గారి విలువ : రూ.22,00,000,
యస్.ఆర్.ఓ విలువ : రూ.15,59,000/-
వేలం తేది : 22-10-2024
Further Hearing : 23-10-2024
యం.కె.దీనదయాళ్,
డి.హెచ్.ఆర్ అడ్వకేట్, తెనాలి
నోట్ : ది.22-05-2006న ఈ ఆస్తిని బేతాళ జాషువ గారికి రూ.1,00,000/- రిజిష్టరు తనఖా బేతం హైమారావుచే చేయబడి ఓ.యస్.నెం. 120/2017గా శ్రీయుతులు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, తెనాలి నందు రూ.11,03,601/-కు ది.24-03-2023న డిక్రీ కాబడియున్నది. సదరు డిక్రీ బాకీకి లోబడి పాడుకొనవలెను.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com